కథానిక:

# అవ్యక్తత్యాగం

రచయిత్రి. శ్రీమతి సులోచన

వెన్నెల- నర్వీచెట్ల పచ్చని ఆకులలోంచి అగుపించే చంద్రుడు - నిశ్శబ్దాని చీల్చివేసే కమ్మనిగాలి- సంపెంగచెట్టు సువాసన; తెల్లని చంద్రుని కాంతులకు మిలమిల మెరిసే గులాబి పూలు: ఇవి చాల వూయౌవన సురుచిరాంగికి, రసగ్రహణ పారీణురాలికి?

ప్రాకృతికి పారవశ్యంలో ఓలలాడుతోంది అనూరాధ పెళ్ళిగానిపిల్ల; పెళ్ళి చేసుకోవాలనే లాలసలేని యౌవన సౌకుమార్య సౌందర్యవతి

పటపటలాడే యౌవనంలో పురుషత్వానికి దూరమై, క్షణక్షణం ప్రజ్వరిల్లే తెలివి కోరికల్ని అణచుకొంటో దిగమింగుకొంటో- స్వస్తిచెప్పుకొంటో, దీక్షగాచదివి పద్దెనిమిది వత్సరాలకే బి. ఏ. ప్యాసయిన పిల్ల అనూరాధ.

ఆమె అందం ఆమెకు తెలీదు మాటిమాటికి అద్దంలో ముఖం చూసుకొంటో, ఏకాంతంగా నగ్నసౌందర్యాన్ని తిలకించుకొంటో— తనను చూసి తనఅవయవాల వొంపుల్ని చూసి సొంపుల్ని చూసి, మొగవాళ్లు అదిరిపోతారని తనా సౌందర్యానికి దాసులౌతారనీ- ఊహించుకొని, పగటి కలలుకంటో, మురిసిపోయే ఆడవాళ్ళంటే అనూరాధకి మహాచెడ్డకోపం; తను ఆ వాతావరణం నుంచి రాలేదుగనుక, నిత్యమూ డబ్బుయిచ్చిన వాడికల్లా శరీరాన్నియిచ్చి, అన్ని కోణాలలో నుంచి, తృప్తినిచ్చి జీవితాన్ని గడిపేవాళ్ళకి, పై రకంస్త్రీలకూ తారతమ్యం ఏమీ లేదంటుంది. కాకపోతే వాళ్ళఅందరికీ తెలిసిన వృత్తి: వీళ్ళది మానసిక వ్యభిచారం,

స్త్రీ సౌందర్యం పురుషుడు అనుభవించి, ఆనందం పొందేందుకుకాదు, అది ప్రకృతిసిద్ధం; మొగవాడు ఒకస్త్రీని పట్టుకొని నీవు అపూర్వ లావణ్యవతివి, అన్నంతమాత్రాన ఆమెలావణ్యం అపూర్వంకాదు. అందంగలస్త్రీ అని అనుకొవేంత వరకే ఆమె అందంగాని- చూచినపాళంగానే అనుభవించాలనే కాంక్ష కలగటం అందంగాదని ఆమె ఊహ,

అసలు అనూరాధకి బాల్యంనుంచీ పురుషులంటే నమ్మకంలేకండా పోవటం, వాళ్ళనో విధంగా ఏహ్యంగా చూడటం; దగ్గరకు చేరనివ్వకపోవటం- జరుగుతూ వచ్చింది. ఇప్పుడు గూడా ఈ యౌవ్వనంలోగూడా, ఆశావాల్నే హృదయంలో నిలవదొక్కుకుందామనీ పురుషుడికి లొంగకుండా వుందామనీ అనుకోంటోవుంటుంది. కాని అలాఅనుకోని విజయం పొందేది. పొందగలిగేది మొదటిరకం ప్రజానీకంతప్ప మధ్యతరగతి, మూడోతరగతి ప్రజానీకం పొందలేదు. అంచాత అలాటి కోర్కెలకు తావివ్వగూడదనికాదు గాని ఇచ్చినా ఏటుతిరిగి వెగ్గవని వృధాప్రయాస కాకుండటయేకాక ఇంకాక్రిందికి, దుర్భర జీవితంలోకి వెళ్ళాల్సిన అగత్యం అవహిల్లుతుంది,

అనూరాధ ఒకప్పుడు మొదటిరకం ప్రజానీకానికి చెందినా ప్రస్తుతం మూడోతరగతి కుటుంబానికి చెందుతుంది

ఇప్పుడు అనూరాధకి వచ్చిన క్లిష్టసమస్య వివాహంకాదు, ఉద్యోగంకాదు- డబ్బు. ప్రపం

చంలో ప్రతి ఒక్కరికీ అవసరమైనడబ్బు. లేని అవసరాల్ని కల్పించేడబ్బు! ఈ క్షణాన ఇరవై రూపాయలు మటుకు వున్నాయ్! వాటిని ఎలా ఖర్చుపెట్టాలో ఏ మోతాదులో ఖర్చుపెట్టితే ఎక్కువరోజులు గడుస్తాయో అర్థంకాలేదు.

తల్లి- రోగంతో బాధపడుతుంది ఆమె రోగం నయం కావాలంటే డబ్బు అవసరం. అవసరమని అనుకోవటం తప్ప డబ్బును పోగు జేసే విధం తెలీటంలేదు ఎంత ఆలోచించినా. అనూరాధకి-

ఆ వెన్నెల్లో గడపమీద కూచోని ఆలోచిస్తున్నది-

తండ్రిగనక వుంటే అవస్థపాలై వుండేదాన్ని గాదేమో, తండ్రిని చంపేశారు దుష్టులు. తన తండ్రిలో ఏలోటు కనపడిందో ఓ అర్థరాత్రి పొడిచేశారు అప్పట్నుంచీ తానీ అవస్థకు కొద్దో గొప్పో పాల్పడాల్సిన అవసరం కలుగుతూనే వున్నది, తన తండ్రీ అమ్మా అప్పుడు ఎంత అన్యోన్యంగా వుండేవారు.'

అప్పుడు ఒక పెద్దభవనం. భవనంముందు ఒకతోట.... అబ్బా! ఆ తోటలో ఎటువంటి పూలుండేటివి' ఎర్రవీ, తెల్లవీ, గులాబివీ. పసుపు పచ్చవీ. వాసనగలవీ, వాసనలేనివీ- నైట్ క్వీన్, సంపెంగ. గులాబి, నందివర్ధన- ఎంత వాసన. తోట్లోకి వస్తేనరి గుమ్ అని కొట్టేది, వాసన. ఎప్పుడూ ఆపూలతో ఆడుకొని కాలాన్ని వెళ్ళబుచ్చేది తను

తండ్రి చనిపోగానే ఆ భవనం తోట ఎవరి చేతుల్లోకో పోయింది, ఎందుకు పోయిందీ. పోవాల్సివచ్చిందీ నిజంగా తనకి తెలీదు ఎవరన్నా చెప్పుకొంటూంటే వినలేదు. అప్పట్నుంచీ డబ్బుకరువయింది కొన్నాళ్లు ఆఫీసులో క్లర్కుగా పనిచేయాల తను. ఛీ. ఆ ఉద్యోగం మూలానే తనకుమరీ మొగాళ్ళంటే అసహ్యం. తను అందంగా వున్నానని ఆఫీసు మేనేజరు తనని మోహించి నీ అపరూప సౌందర్యానికి దాసుణ్ణయ్యానని వెంటపట్టుకుంటాడా! తనా అవమానాన్ని, అసహ్యతనీ భరించలేక ఉద్యోగానికి తిలోదకాలు యిచ్చిన దగ్గర్నుంచీ డబ్బు మరీ కరువైంది. తను మేనేజరుతో తగువాడి. ఉద్యోగానికి రాజీనామాయిచ్చానన్న సంగతి తనింతవరకు అమ్మకు చెప్పలేదు ఎందాక? తెల్సింతరువాత ఏమనుకొంటుంది?

ఈ ప్రపంచంలో తను అందంగా వుండటమే తన జీవితానికి కళంకమయిపోయింది ఈ చరాచరంలో తనకేమన్నా శత్రువుంటే తన సౌందర్యమే, తనేగనక అందవిహీనయైవుంటే, మేనేజరు తనని కామించవలసిన అవస్యకత ఏర్పడదు తను రాజీనామాయివ్వాల్సిన అవసరం ఉండేదిగాదు.

తనకో సోదరుడుంటే- కనీసం ఈ ప్రపంచం ఆమెకో సోదరుడున్నాడని అనుకొంటే తను ఈ అందరికళ్లలో పడదు.

ఆలోచించుకొని చాలా కష్టపడ్డది: ఈ దురదృష్టాల్ని కలిగివున్నందుకు.

'అమ్మాయీ. అనూ!' అమ్మ పిలుపు

'వస్తున్నా!' యింట్లోకెళ్ళింది.

'మంచినీళ్ళివ్వమ్మా'

ఆలోచనే నిద్రగా పెట్టుకోటంచాత ఆమె నేత్రాలు ఎర్రటి చారలుగా తయారయ్యాయ్ మంచినీళ్ళ గ్లాసుతెచ్చి తల్లిచేతి కిచ్చింది 'అదేమిటి! అమ్మాయ్ కళ్లు ఎర్రగావున్నాయ్ ఎందుచేత?'

కారణం చెప్పకుండా పరుగెత్తుకొంటో వెళ్ళింది. వెందులో తలమార్చి ఏడ్వటం ఆరంభించింది ఆమెకు కర్తవ్యం బోధపడటంలేదు

అమ్మరోగం నయంకావాలి! నయంకావాలి అమ్మ రోగం! మరి డబ్బుకావద్దూ!

ఆలోచించి ఆలోచించి చివరకు ఒక నిశ్చ యానికొచ్చి, పేపర్ ఎడిటర్‌కు ఒక ఉత్తరం వ్రాసింది అ ఉత్తరంలో ఒక ప్రకటన పంపింది.

'పద్దెనిమిదేళ్ళుగల బి. ఏ. ప్యాసయిన అం దంగల స్త్రీని- ఏక్కడపడబ్బిచ్చే సౌందర్యంగల చదువుకొన్న వరుడుకావాలి' అని.

మర్నాడు పేపర్లో ప్రకటనవచ్చింది. అనూ రాధ అదిరిపోయింది. అచ్చులో ప్రకటన చూడ గానే.

అమ్మతో ఆలోచించకండా, కనీసం చెప్ప నన్నా చెప్పకండా ఈపని చేసినందుకు, కేవలం డబ్బుకోసం ఈపని తలపెట్టినందుకు ఎంతోగా నొచ్చుకుంది అనూరాధ!

డాక్టరు వచ్చాడు 'రోగం నయమవుతుందా!' అన్నది అనూరాధ ఆదుర్దాగా-

'నయమవుతుంది, కాని విలంబనం జర గొచ్చు.' పాపం డాక్టరు మంచివాడు తండ్రి వున్నప్పట్నించి వైద్యం చేస్తున్నాడు అందరితో బాగా మాట్లాడతాడు.

ఓనాడు సాయంకాలం అమ్మనిచూట్టాని కొచ్చి, డబ్బుకోసం బాధపడుతున్నామన్న సంగతి తెలిసి 'అంతగా అవసరమైతే ఇదుగో డబ్బు' అని ఆరు పదురూపాయనోట్లు ఇవ్వబోయాడు. అనూ రాధ ఆలోచించింది. ఇప్పుడు తీసుకున్న రేపు ఏక్కడనుండి తెచ్చియిచ్చేట్టు!

ఓరోజు పొద్దున మందులపెట్టె చేతపట్టుకొని డాక్టరు వచ్చాడు- కారుడ్రైవరు కొత్తగా వచ్చా డట.

ఆయన్ని చూడగానే అనూరాధలో ఏదో హృదయంలో తెలీని మధురమైన భావనలు రేకెత్తుతున్నాయి పురుషులమీద ద్వేషంకొద్దీ ఏ అందమైన పురుషుని చూసినా మనసుకదలివిది- ఈనాడు ప్రకటన అచ్చయినాక, ఎలాగైనా ఏ పురుషుణ్నో ఒక పురుషుణ్ణి డబ్బుకోసం ప్రేమిం చాల్సిందేగనక; ఇతని విశాల వక్షస్థలమూ కం డలుతిరిగిన బాహువుల్నీ నున్నగా మెరిసేశరీరాన్ని చూస్తున్నకొద్దీ- ఆచూపుల్లో చూపుకలపాలనీ . హృదయంలో హృదయం ఇలా అనిపించింది.

ఆయన అనూరాధని ప్రేమగాచూస్తూ వెళ్లాడు.

ఆరోజునుంచీ అనూరాధలో వెనుకటి పురుష ద్వేషం క్రమంగా కరగసాగింది. డ్రైవరుమీద అంతరప్రేమ పెరుగసాగింది.

ఓరోజు ఈ ప్రకటన చూస్తున్నాడు చూసి భయపడింది అనూరాధ ఉత్తరం వ్రాస్తాడేమోనని మళ్ళా కలిగింది వ్రాస్తే మంచిదౌనన్నదభి ప్రాయం.

వాళ్ళిద్దరిలో ప్రేమ అంతరంగంగా హృద యాల్లో పెరుగసాగింది.

ఆమె డ్రైవర్ను ప్రేమించటానికి అతనిలోని బాహ్యాంతర సౌందర్యమే కారణమని ఆమె అను కొంటుం దనుకోడం పొరబాటు కాకపోయినా, తల్లిరోగం నయమయేందుకు అవసరమైన డబ్బు కోసం ప్రేమిస్తుంది.

అనూరాధ ప్రకటించిన ప్రకటనమూలంగా ఉత్తరాలు రాసాగినయ్. టైపిస్టు లైబ్రేరియన్, కాంపోండరూ - ఆఫీసరూ ఎవరో ఒకతనూ ఇంకోకతనూ మొత్తానికి చాలామంది వ్రాసారు. అందులో ఒక్కఉత్తరంమటుకు చూడగానే ఆక ర్షించింది. ఆయన ఇలా వ్రాసాడు 'నేను చదువు కొన్నవాణ్ణేను- సౌందర్యంగలవాణ్ణేను- నీవుఎంత డబ్బుకోరితే అంతడబ్బు యిస్తాను' అని. పైగా ఫలానాచోట కల్సుకోమని అడ్రసు యిచ్చాడు.

సకాలానికి ఆమె అక్కడకువెళ్ళింది. అతను మర్యాదగా పలుకరించాడు. అతన్ని చూడగానే ఆదిలో ఆశ్చర్యపోయింది. బట్టతల ఎర్రగా

ముడుతలుపడ్డ శరీరం. సార్లకోటు- అచ్చుగా డాక్టరు మాదిరిగా వున్నాడు. తను వచ్చినందుకు నిందించుకొంటూ శూన్యంకేసి చూస్తుంది.

అతను అన్నాడు "ఎంత కావాలి" అని

ఆమె అలాగే ఏమీ తెలియనట్టు చూస్తుంది.

ఇరవై అయిదు వేలిస్తాను?

అంత పెద్దమొత్తాన్ని తలచుకొని ఆమె అదిరిపోయింది తను స్వేచ్ఛగా అడగదలచుకొన్న మొత్తం ఆ మొత్తంలో నాలుగోవంతైనా లేదు. ఇప్పుడు తనసౌందర్యంవిలువ ఇరవై అయిదువేలు. ఆధనంతో పూర్వపుటౌన్నత్యాన్ని పొందొచ్చు మరి డ్రైవరు? తనుమనసారా ప్రేమించే డ్రైవరు ఏంగాను? రాధా! నిన్నువిడిచి నీ సౌందర్యానికి దూరమై నేనేమైపోను అని ఓ రోజు వెన్నెల రాత్రి తను యిదిగా మాట్లాడితే, అతను అన్న మాటలు అనూరాధకి ఏం తోచలేదు. దాదాపు మాటలుగూడా డాక్టరు మాట్లాడేలాగునే వుంటున్నాయి కర్తవ్యం ఏమిటి?

భార్యగా అంగీకరిస్తే ముప్పైఅయిదు వేలిస్తాను అయన బుర్రమీసాల్లోంచి సన్నగా నవ్వు.

"క్షమించండి తెలీక చేశాను" పరుగెత్తబోయింది.

అడ్డుతగిలి డబ్బుచాలదా? నలభై వేలిస్తాను ఏం?

ఆమెకు ఏంచేయాలో ఏమనాలో ఏంచేస్తే- ఏమంటే వదలిపెడతాడో ఆలోచిస్తుంది

'రేపు మాట్లాడుకుందాం వెళ్ళబోయింది-

అడ్డుతగిలి—

అలా చెల్లదు. ఇవాళే తేలాలి నిన్ను భార్య స్వీకరించనిదీ నీ సౌందర్యాన్ని అనుభవించనిదీ నాకు నిద్రపట్టదు.

అతని మాటలకు ఆశ్చర్యపోయింది. ప్రేమ-డ్రైవరు ఏంగాను? నిముషంలో నాశనమయ్యే డబ్బుదేనికి? నిశ్చలమైన నిర్మల ప్రేమకావాలి? అంటే డ్రైవర్ని చేసుకోవాలి. మరి అమ్మ రోగం నయంకావాలి. అందుకోసం అవసరమైన డబ్బుకావాలి ఎట్లా? డ్రైవరు ఇవ్వగలడా? నలభైరూపాయల జీతంతో బ్రతికే ఈ డ్రైవరు? దేనికి డబ్బు? ఏమన్నాకాని- ఈ బుర్రమీసాల పెద్దమనిషికి లొంగను?

కుక్కిమంచంలో- అమ్మ బాధతో మూలుగుతుంది. మంచినీళ్లు అని అరుస్తోంది- అందించేందుకు తనులేదు అక్కడ. ఇక్కడ డబ్బుకోసం.... యింట్లో లేకుండా అమ్మ తెలీకుండా ఏదో చేయబోయింది తను ఛీ-

ఆమె వెళ్ళింది పరుగెత్తుకొంటో అవ్యక్తి అలానే చూస్తున్నాడు-

మరునాడు డాక్టరు చెప్పాడు-

రాత్రి నీతోకల్పుకొని మాట్లాడింది నేనేను. నువ్వు డ్రైవర్ని ప్రేమించావన్న సంగతి నాకు తెలుసు- నీకుతెలీని ఊహించలేని సంగతి ఒకటి చెప్తున్నాను- ఆ డ్రైవరు నాకొడుకేను. నీకు డబ్బు అవసరంకాబట్టినేను వచ్చాను. నిన్ను పరీక్ష చేద్దామనిగూడా అధికంగా మాట్లాడాను! నువ్వేమీ దిలాపడకు అమ్మరోగం నయంచేసే బాధ్యతనాది. మీరిద్దరూ పెళ్ళి చేసుకొండి సుఖంగావుండండి. నవయవ్వనులు- అదేనాకు కావాల్సింది- కోరేదిగూడాను అని-